క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు

ఎల్కతుర్తి: వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతున్న గీతకార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన మండలంలోని దామెర గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పచ్చిముట్ల రమేష్‌గౌడ్ వృత్తిరీత్యా కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. కల్లు దింపుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి చెట్టుపై నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన గీత కార్మికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నవరాత్రి ఉత్సవాల్లో హోంమంత్రి

హన్మకొండ: రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావును హనుమకొండ హంటర్‌రోడ్డులోని స్వగృహంలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో హోంమంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ కుటుంబ సభ్యులు వొడితల సరోజినీదేవి, డాక్టర్ షమిత, వొడితల ఇంద్రనీల్, డాక్టర్ శంసిత పాల్గొన్నారు.

లక్ష్మీసహస్ర మహాయాగం

హన్మకొండ కల్చరల్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అగ్రతి గజానన మండలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ సహస్ర మహాయాగాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. హనుమకొండ ఎక్సైజ్‌కాలనీ ఫేస్-2లో ప్రముఖ జోతిష్య వాస్తు పండితుడు సౌమిత్రి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో నిర్వహించారు

కాపర్‌వైర్ చోరీ

దామెర: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాపర్ వైర్ చోరీ అయ్యింది. ఈ ఘటన మండలంలోని సింగరాజుపల్లిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సింగరాజుపల్లిలోని దేవాదుల పంప్‌హౌజ్ స్టాఫ్ క్వార్టర్స్‌లో ఎస్ఎస్27, 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కాగా ఈ నెల 18 వ తేదీన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు పరిశీలించారు. తిరిగి ఈ నెల 20వ తేదీన సాయంత్రం మరోసారి అధికారులు పరిశీలనకు వెళ్లగా స్టాఫ్ క్వార్టర్స్ గేటు తాళం ధ్వంసం చేసి ఉండడం గమనించారు. లోనికి వెళ్లి చూడగా క్వార్టర్స్ ఖాళీగా ఉంది. గద్దెపై ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను కిందపడేసి అందులోని ఆయిల్, కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు నిర్ధారించారు. వీటి విలువ సుమారు 80, 000 ఉంటుందని అంచనా వేశారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ గుర్రం రమేష్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


66వ డివిజన్‌లో అన్నదానం

హసన్‌పర్తి: 66వ డివిజన్ పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో, గాంధీనగర్, ఎల్లాపురం గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారికి ఎమ్మెల్యే అరూరి రమేష్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, నాయకులు పిట్టల కుమారస్వామి, చంద్రమోహన్, వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, పెద్దమ్మ శ్రీనివాస్, గిన్నారపు రవీందర్, గౌరిశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

నయీంనగర్: హనుమకొండ పద్మాక్షి సిద్దేశ్వర దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, సోమవారం దసరా, రావణ వధ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని విజయదశమి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రావుల సుదర్శన్ విజ్ఞప్తి చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పేరుతో ఉత్సవాలు, ఏర్పాట్లపై ఆంక్షలు విధించడం సమంజసం కాదని అన్నారు. ఉపాధ్యక్షుడు చీకటి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పులగండం రాజారాం, సాంబరాజ్ రాజ్‌కుమార్, పులి రజనీకాంత్, మారెపెల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజు



హసన్‌పర్తి: యూత్‌కాంగ్రెస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడిగా సీతంపేటకు చెందిన బాషబోయిన రాజుయాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేపల్లి రంగనాథ్ ప్రకటించారు.

మహిళ దుర్మరణం

హసన్‌పర్తి: రైలు ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని మహిళ దుర్మరణం చెందిన సంఘటన కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం జరిగింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సదరు మహిళ వయస్సు 55 - 60లోపు ఉంటుందని తెలిపారు. వివరాలకు 99594 25483 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

తనిఖీల్లో రూ.88 వేలు స్వాధీనం

ఖిలా వరంగల్: వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్‌లో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. కారులో ప్రయాణిస్తున్న ఎస్‌డీ.హసియా వద్ద రూ.88 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

మండపాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు

- ఆరో రోజు కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



ఎల్కతుర్తి : ముల్కనూర్‌లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్, తదితరులు

ఎల్కతుర్తి: జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. దుర్గామాత అమ్మవారిని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో విరజిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీపీ జక్కుల అనీతరమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు మారపాటి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని శివ మార్కండేయ ఆలయంలో, పెద్దకోడెపాక రాజరాజేశ్వర ఆలయంలో ఎస్‌పీటీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా కొనసాగుతున్నాయి. ఏడోరోజు దుర్గాదేవిని మహా సరస్వతిగా అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, అనుదీప్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.



ఆత్మకూరు : భోజనం వడ్డిస్తున్న ఎస్సై

ఆత్మకూరు: మండల కేంద్రంలో శ్రీవేణుగోపాలస్వామి భజన మండలి, గుడెప్పాడ్‌లో విఘ్నేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో పెంచికలపేటలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం దుర్గాదేవి సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. మండలంలోని గుడెప్పాడ్‌లో జరిగిన ఉత్సవాల్లో భాగంగా మహాఅన్నదానం నిర్వహించగా స్థానిక ఎస్సై రాజేష్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఉపసర్పంచ్ వీసం శ్రీనివాస్‌రెడ్డి, ఓంప్రకాశ్‌రెడ్డి, సముద్రాల భిక్షపతి, వివేక్, సాయితేజ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : సర్వస్వతి అలంకరణలో దుర్గాదేవి

పూలను పూజించే గొప్ప సంస్కృతి



నడికూడ : మహిళలతో కలిసి వెళ్తున్న చల్లా జ్యోతి



శాయంపేట: నాగార్జున పాఠశాలలో..

నడికూడ: పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ రాష్ట్రానిదని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి అన్నారు. మండలంలోని చర్లపల్లిలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని ఆడిపాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం బతుకమ్మ పండుగకు సీఎం కేసీఆర్ ప్రత్యేక గుర్తింపు తీసుకొవచ్చారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మచ్చ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, పాడి కల్పనదేవి పాల్గొన్నారు.

నాగార్జున స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు

శాయంపేట : మండలంలోని గట్లకనిపర్తి గ్రామంలో గల నాగార్జున స్కూల్‌లో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో విద్యార్థులు ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పర్వదినం నిలుస్తుందని ఉపాధ్యాయులు అన్నారు. అందరూ సంతోషాల మధ్య పండుగ జరుపుకోవాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ గుర్రం అశోక్, ప్రిన్సిపాల్ వినీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తవేస్తే కఠిన చర్యలు



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పరకాల: రహదారులు, కాలనీలు, కూడళ్ల వద్ద చెత్తా, చెదారం వేసేవారిపై చర్య తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, 13వ వార్డు కౌన్సిలర్ శనిగరపు రజని హెచ్చరించారు. పట్టణంలోని 13వ వార్డులోని వడ్లవాడ, బ్రాహ్మణవాడ, హరితనగర్‌కు వెళ్లే కూడలి వద్ద నిత్యం చెత్త, చెదారం వేస్తు కొందరు డంపింగ్ యార్డుగా మార్చడంపై కాలనివాసులు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె తక్షణమే చెత్తతరలింపు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరడంతో డోజర్‌తో చెత్తా, చెదారాన్ని తొలగించారు.

మాదిగలు మేల్కొవాలి



మాట్లాడుతున్న బైరపాక ప్రభాకర్

ధర్మసాగర్: 45 సంవత్సరాలుగా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో వలస పాలితులు ఏలుతున్నారని, ఇప్పటికైనా స్థానిక మాదిగలు మేల్కొవాలని టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి బైరపాక ప్రభాకర్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగ బిడ్డలు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ మాదిగలను చులకనగా చూస్తుందని ఆరోపించారు. ధర్మసాగర్ మండలంలోని ఎల్కుర్తిలో దళితులకు ఇచ్చిన భూమి ఎకరం కేవలం రూ. 8,65 లక్షలకు 53 ఎకరాలు తీసుకొని దళితులను మోసం ఆయన చేసిందని ఆరోపించారు.

మాదిగలకు సంక్షేమ పథకాలు అందించాలి



హరీశ్‌రావును కలిసిన ఉపేందర్

ధర్మసాగర్: రాష్ట్రంలోని మాదిగ కులస్తులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావును శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో మాదిగలకు అందడంలేదని తెలిపారు. మాదిగల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీంతో మంత్రి హరీష్‌రావు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మాదిగలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మాదిగ బిడ్డకు సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

జన్మదిన వేడుకలు



పూల బొకే అందజేస్తున్న అభిమానులు

కమలాపూర్: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తక్కళ్లపల్లి సత్యనారాయణరావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



బ్యాటింగ్ చేసి క్రీడలను ప్రారంభిస్తున్న చీఫ్‌విప్

విద్యారణ్యపురి: విద్యార్థులు చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సూచించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు శుక్రవారం ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు, హనుమకొండ జేఏసీ కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, కార్యదర్శి తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు మంద సుచందర్, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, నాయకులు సముద్రాల అనిల్, శివరాత్రి కరుణాకర్, సంగాల ప్రణయ్, ఎనగంటి రామకృష్ణ, కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత స్థలం మార్పిడి

పరకాల: సద్దుల బతుకమ్మ సందర్భంగా ఈ నెల 22 వ తేదీన జరుగనున్న పశువుల, గొర్రెల, మేకల సంత స్థలాన్ని తాత్కలికంగా మార్పు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గంగా వైన్స్ పక్కన గల స్థలంలో పశువుల సంత జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నియామక పత్రం అందజేస్తున్న యాదవరెడ్డి

విద్యారణ్యపురి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి సూచించారు. హనుమకొండలో 8వ డివిజన్ బీఆర్ఎస్‌వీ నూతన అధ్యక్షుడిగా నలుబోతు కార్తీక్‌తోపాటు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జ్ సారంగపాణి, బాధ్యులు నలుబోలు సతీష్, బీఆర్ఎస్‌వీ డివిజన్ ఇన్‌చార్జ్ బైరపాక ప్రశాంత్, రాకేష్ యాదవ్, కల్యాణ్, యూత్ జనరల్ సెక్రటరీ కూచన సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన పెర్షియన్ కార్పెట్ కక్టస్

శాయంపేట : మండలంలోని పెద్దకోడపాక గ్రామానికి చెందిన వనప్రేమికుడు కోమనేని రఘు ఇంటి ఆవరణలో అరుదైన పెర్షియన్ కార్పెట్ కాక్టస్‌ను శాస్త్రీయ (ఎడిత్‌కోలియా గ్రాండిస్) మొక్కకు అందమైన పువ్వు వికసించింది. పువ్వుల కారియన్ లాంటి వాసన పరాగసంపర్కం కోసం ఈగలు, ఇతర కీటకాలను ఆకర్షిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఎడారి తోటల్లో అలంకారంగా ఈ మొక్కలు సాగు చేయబడుతాయి. చాలా తేలిక, సాపేక్షంగా అధిక (60 ఎఫ్/15 సెంటిగ్రేడ్ కంటే ఎక్కువగా) శీతాకాలపు ఉష్ణోగ్రతతో పెరుగుతూ అవసరాల అనుగుణంగా చాలా కష్టమైన మొక్కగా ఖ్యాతిని పొందింది. తక్కువ ఉష్ణోగ్రత నమోదు అయితే కుళ్లిపోయే అవకాశం ఉంది. పెర్షియన్ కార్పెట్ ఫ్లవర్ కాండం ఇథియోపియా, సోమాలియాలో కూరగాయాలుగా ప్రజలు వినియోగిస్తారు. జనవరి 2018 సంవత్సరంలో గుజరాత్ నుంచి తన మిత్రుడు ఈ మొక్కను అందజేశాడని తెలిపారు. ఈ పువ్వును చూడడానికి గ్రామస్తులు ఆసక్తి కనబరుస్తున్నారు.



ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఖిలా వరంగల్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అబ్దుల్లా ఖాసీం షాహిద్ దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎం.ఏ.జబ్బార్ అన్నారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఏకశిలనగర్‌లోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసీం షాహిద్ దర్గా అభివృద్ధి కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్ గెలుపు కోసం దర్గాలో ప్రార్థనలు చేసినట్లు చెప్పారు.

గ్రామాల్లో ఎన్నికల అధికారుల తనిఖీలు

- బెల్ట్‌షాపులపై ప్రత్యేక నిఘా



కిరాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పరకాల: రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల ఎన్నికల అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. బెల్ట్‌షాపులపై ప్రత్యేక నిఘా వేసి దాడులు ముమ్మరం చేస్తున్నారు. పోచారం, కామారెడ్డిపల్లె, అలియాబాద్ గ్రామాల్లోని కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు. ఎంసీసీ టీం ఎన్నికల అధికారి శేషాంజన్‌స్వామి ఆధ్వర్యంలో పలు కిరాణా దుకాణాల్లో తనిఖీ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఎవరైనా కోడ్‌ను ధిక్కరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వరకు ఉద్యమిస్తాం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దినేష్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దినేష్, తదితరులు

కమలాపూర్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించే వరకు తమ ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్‌మాదిగ స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీన హనుమకొండ జిల్లా కేంద్రంలో జరుగనున్న మాదిగల విశ్వరూప రథయాత్రను, విశ్వరూప సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి సభకు సంబంధించిన కరప్రతాలు ఆవిష్కరించి మాట్లాడారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూప రథయాత్ర ఈ నెల 24 వ తేదీన హనుమకొండ జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, రథయాత్ర అనంతరం సన్నాహక సమావేశం ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇప్పటికైనా బీజేపీ ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించేలా ప్రతిపక్షాలు ఒత్తిడి తేవాలని, లేదంటే హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభలో మాదిగల విశ్వరూపాన్ని చూస్తారని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుకుమార్, ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతిసాగర్, నాయకులు ప్రసాద్, కిరణ్, స్వామి, రవీందర్, రమేష్, శ్రీను, రాకేష్, కుమార్, వీరస్వామి పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



గ్రామస్తులతో మాట్లాడుతున్న కాళీప్రసాద్‌రావు



పరకాల: మట్టి సేకరిస్తున్న నాయకులు

ఆత్మకూరు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు గెలిచి రాష్ట్రంలో అధికారంలోకి రానుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్ రావు అన్నారు. మండలంలోని చౌళ్లపల్లి, అగ్రంపహాడ్ గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికెళ్లి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రజలు బీజేపీ అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బయ్య పైడి, నాయకులు ఎదులాపురం శ్రావణ్‌కుమార్, పింగిలి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేరీ మిట్టీ – మేరా దేశ్

పరకాల: జాతీయ భావాన్ని పెంపొందించేందుకే మేరి మిట్టి, మేరాదేశ్ కార్యక్రమాన్ని దేశ ప్రధాని నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. వివిధ గ్రామాల నుంచి స్వాతంత్ర్య సమరయోధులు, సైనికుల నివాసాల నుంచి సేకరించిన మట్టిని అమరధామంకు తరలించి అక్కడి నుంచి ఒకే కలశం ద్వారా తరలించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా ఈ నెల 1వ తేదీన నుంచి 23వ తేదీ వరకు గ్రామగ్రామాన సమరయోధులు, సైనికుల నివాసాల నుంచి మట్టి సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ జేఏసీ కన్వీనర్ డాక్టర్ సిరికొండ శ్రీనివాసచారి, బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, నియోజకవర్గ కన్వీనర్ ములకల ప్రసాద్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బాసాని సోమరాజ్, మొలుగూరి శ్రీనివాస్, పట్టణ నాయకులు గాజుల నిరంజన్, ఆకుల రాంబాబు నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గండ్రతోనే గ్రామాల అభివృద్ధి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న సర్పంచ్

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హయాంలోనే మండలం అభివృద్ధి చెందిందని సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో శుక్రవారం ఆయన ఆయా వార్డులను సందర్శించి ఎమ్మెల్యే రమణారెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ అభివృద్ధిలో తెలంగాణను అగ్రగామిగా నిలిపారని అన్నారు. ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలకు, ప్రలోభాలకు గురి కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కందగట్ల ప్రకాశ్, నాయకులు బండా జైపాల్‌రెడ్డి ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



నడికూడ : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన సాదిక్, బాచి, ఏరుకొండ వెంకటలక్ష్మి, మునిగంటి భాగ్యలక్ష్మి, పానకాని స్వామి, పాయిరాల సమ్మక్క, సాంబయ్య కుటుంబాలకు, నడికూడ మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన పలు బాధిత కుటుంబాలను శుక్రవారం ఆయన పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు, వైస్‌ఎంపీపీ రేవూరి సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, ప్రధానకార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, గ్రామ అధ్యక్షుడు పాపని రవీందర్, నాయకులు భగవాన్‌రెడ్డి, అంకూస్, రేవూరి ప్రవీణ్‌రెడ్డి, పైడి, సంతోష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చందు, గణపతిరెడ్డి, జయపాల్‌రెడ్డి, మచ్చ రవీందర్, తిప్పర్తి సాంబశివరెడ్డి, అనిల్, నాగిరెడ్డిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.